క్లుప్తంగా

పల్నాటి సొసైటీ ఆధ్వర్యంలో చేయూత



మాచర్ల: పల్నాటి సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని రోప్‌లైన్ కాలనీకి చెందిన పేద మహిళకు చేయూతనందించారు. తాళ్ళపల్లి బట్టు నాగమ్మకు మొత్తం రూ. 10వేల విలువైన వస్తువులను పల్నాటి సొసైటీ అధ్యక్షుడు, న్యాయవాది జి.జయానందరావు, కన్వీనర్ వై.సాంబశివరావులు అందజేశారు. జాతీయ ప్రజా హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గురజాల అప్పారావు, పలువురు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి పింఛన్ అందజేత



దాచేపల్లి: డయాలసిస్ బాధితుడి ప్రభుత్వం రూ.10వేలు పింఛన్‌ను మంజూరు చేసింది. నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డుకు చెందిన షేక్ షబ్బీర్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ గత కొంతకాలం నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నాడు. పింఛన్ కోసం వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం రూ.10వేల పింఛన్‌ను మంజూరు చేసింది. మంజూరు చేసిన పింఛన్ నగదును వలంటీర్‌తో కలిసి 20వ వార్డు కన్వీనర్ ముశ్యం వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి వేముల శ్రీహరి, సచివాలయం కన్వీనర్ సయ్యద్ మౌలాలీలు లబ్ధిదారుడు షబ్బీర్‌కి అందజేశారు. నాయకులు ముశ్యం శ్రీనివాసరావు, ఉప్పల రామాంజనేయులు, కొతవరపు ఏడుకొండలు, సయ్యద్ సైదావలి పాల్గొన్నారు.

వీహెచ్‌పీ నూతన కార్యవర్గం ఎన్నిక

గురజాల: స్థానిక సీతారామ స్వామి వారి దేవాలయంలో ఆదివారం విశ్వ హిందూ పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నగర పంచాయతీ ప్రముఖ్‌గా(అధ్యక్షుడు) బొప్పూరి బాబురావు, కార్యదర్శిగా మహంకాళీ దుర్గాప్రసాద్, కోశాధికారిగా చింతపల్లి ఏడుకొండలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు అధికారిగా జిల్లా మహిళా ప్రముఖ్ జొన్నలగడ్డ రాజేశ్వరి, దుర్గా వాహిని సభ్యురాలు టి.విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుండాకాశీ విశ్వనాథం, దేవాలయం కమిటీ చైర్మన్ కందుల సాంబశివరావు, పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ గుండా సురేష్‌బాబు, పి.నాగేశ్వరరావు తదితరులున్నారు

కనకదుర్గమ్మకు బోనాలు సమర్పణ

పిడుగురాళ్ళ: పట్టణంలోని భవానీ నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ఆదివారం బోనాల సమర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు వేల సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలను సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ పూజారి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు



గురజాల: శ్రీ సత్యసాయిబాబా దేవాలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

క్రాప్ ఇన్సూరెన్స్ నగదు జమ

పిడుగురాళ్ల: 2022 ఖరీఫ్ పంటకు సంబంధించి వైఎస్సార్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ నగదు జమ అయినట్లు ఏడీఏ కృష్ణదేవరాయలు తెలియజేశారు. నియోజకవర్గంలోని గురజాలకు చెందిన 6941మంది రైతులకు గాను రూ. 2.08 కోట్లు, దాచేపల్లి 7900 రైతులకు గాను రూ. 1.83 కోట్ల నగదు, పిడుగురాళ్ల 2821 మంది రైతులకు గాను రూ. 0.50 కోట్లు మొత్తం 17,662 మంది రైతులకు గాను రూ.4.43 కోట్లు నగదు రైతుల ఖాతాలలో జమ చేయటం జరిగిందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా మాచవరం మండలంలో ఎలాంటి ఇన్సూరెన్స్ క్లెయిమ్ జరగలేదని ఆయన తెలియజేశారు.

అవకాశాల కోసం పార్టీలు మారలేదు

- రాజకీయ జీవితం ప్రారంభం నుంచి ఇప్పటివరకు వైఎస్సార్ కుటుంబంతోనే ఉన్నా..
- మూడోసారీ సత్తెనపల్లిలోనే పోటీచేస్తున్నా..
- 4వ తేదీన జరిగే రంగా విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేద్దాం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అవకాశాల కోసం పార్టీలు మారి, జెండాలు మార్చిన విశ్వాస ఘాతకుడిని కాదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మాజీ శాసన సభ్యుడు, కాపు ఉద్యమనేత వంగవీటి మోహన్‌రంగా జయంతిని పురస్కరించుకొని పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఈనెల 4వ తేదీన జరిగే ఆయన కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. సమావేశానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని నమ్ముకుని, వారి వెంట నడిచి విశ్వాసపాత్రుడిగా ఉన్నానన్నారు. మూడోసారి కూడా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు. వంగవీటి మోహన్‌రంగా హత్య సమయంలో న్యాయవాదిగా ఉన్న తాను, ఆయన మరణానంతరం 30 ఏళ్ల వయసులో ఎన్నికలలో పోటీ చేసి తొలిసారిగా శాసనసభ్యుడిగా ఎన్నికయ్యానన్నారు. ఈ విధంగా వంగవీటి మోహన్ రంగాపై అపారమైన ప్రేమ, అభిమానంతో ఉన్నానన్నారు. రంగా మరణం తర్వాత ప్రజా సానుభూతితో ఎదిగిన వాళ్లం కనుక కృతజ్ఞతతో సత్తెనపల్లి పట్టణంలో రంగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని సమష్టి కృషితో విజయవంతం చేద్దామన్నారు. ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ, తాను ఒకేసారి కాంగ్రెస్ పార్టీలో శాసనసభ్యులుగా ఎన్నికయ్యామని, ఆయన పార్టీలు మారి టీడీపీలో చేరాడని, తాను వైఎస్ కుటుంబంతో నడిచి ఇప్పుడు ప్రత్యర్థులుగా ఉన్నామన్నారు. అవకాశాల కోసం పార్టీలు మారే సంస్కృతి తనది కాదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పక్కాల సూరిబాబు మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా ఫొటో పెట్టుకుని ఎన్నికల్లో గెలిచి, ఆయన అభిమానిని అని చెప్పి నాయకుడిగా ఎదిగి, రంగా హత్యకు కారణమైన తెలుగుదేశం పార్టీలో చేరి కాపుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన కన్నాకు కాపులు ఓటు వేయరన్నారు. టీడీపీకి ఓటు వేస్తే రంగా ఆత్మ క్షోభిస్తుందన్నారు. వంగవీటి మోహన్ రంగా కాంస్య విగ్రహావిష్కరణ ఒక కార్యక్రమం మాత్రమే కాదని ఎన్నికల సమర శంఖారావం పూరించే వేదిక అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు, కాపు సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరావు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి, నాయకులు పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), సదనం హరి, వెలుగూరి శరత్, కాకుమాను రవి, రాజవరపు శివనాగేశ్వరరావు, వరికల్లు కోటేశ్వరరావు, జూపల్లి పాల్, షేక్ జానీ కౌన్సిలర్‌లు, ప్రజా ప్రతి నిధులు, నాయకులు ఉన్నారు.

శభాష్ వలంటీర్స్!

దూర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్న వృద్ధులకు పెన్షన్లు అందజేత



మార్కాపురంలో వృద్ధురాలు కాంతమ్మ బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ దివ్య



హైదరాబాద్ వైద్యశాలలో వృద్ధురాలు అంజమ్మ బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ తిరుమల

సత్తెనపల్లి: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన మార్తాల కాంతమ్మ వృద్ధురాలు. ప్రతి నెలా ఆమె వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటుంది. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురై ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఆమె కుమార్తె వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. ఆమెకు 13వ వార్డుకు చెందిన వలంటీర్ దివ్య ఆదివారం మార్కాపురం వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. స్థానికంగా అందుబాటులో లేకపోయినా జిల్లా దాటి వచ్చి పెన్షన్ అందించేలా చర్యలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.పెన్షన్ అందించిన వలంటీర్ దివ్యను వృద్ధురాలుతో పాటు ఆమె కుటుంబ సభ్యులు అభినందించారు. అలాగే పట్టణంలోని 19వ వార్డుకు చెందిన బుడేటి అంజమ్మ ఇటీవల ఆమె అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతుంది. తను రాలేని పరిస్థితిలో ఉండటం వల్ల వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న కర్ర తిరుమల హైదరాబాద్ వెళ్లి ఆదివారం పెన్షన్ పంపిణీ చేశారు. పక్క రాష్ట్రంలో వైద్యశాలలో ఉన్నప్పటికీ ఠంచన్‌గా పెన్షన్ అందించేలా చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు. పది కాలాల పాటు ఆయనే సీఎంగా ఉండాలని ఆమె ఆంకాంక్షించారు. వలంటీర్ తిరుమలను వృద్ధురాలితోపాటు, కుటుంబ సభ్యులు అభినందించారు.

మద్యం తాగి వాహనం నడిపితే కేసులు



వాహన చోదకుడిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న నకరికల్లు ఎస్‌ఐ పి.సురేష్

నకరికల్లు: మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ పి.సురేష్ హెచ్చరించారు. స్థానిక వై.జంక్షన్ వద్ద ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. వాహనాల రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు -4, ఎంవీ యాక్ట్ కేసులు 24 నమోదు చేసి రూ.4,200 అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'కి కొత్త సాఫ్ట్‌వేర్ కష్టాలు!

- కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన సాఫ్ట్‌వేర్‌తో కూలీలకు అందని అలవెన్స్‌లు
- తట్ట, బుట్ట, గడ్డపార చార్జీలు సైతం నిలుపుదల
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు



గండ్లూరులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల వేసవి అలవెన్స్‌లకు కొత్త సాఫ్ట్‌వేర్ బ్రేక్ వేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో ఉన్న రాష్ట్ర సాఫ్ట్‌వేర్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్ తీసుకొచ్చింది. దీంతో కూలీలకు అందాల్సిన పలు రకాల అలవెన్స్‌లు సైతం నిలిచిపోయాయి. తట్ట, బుట్ట, గడ్డపార, తాగునీటి అలవెన్స్‌తో పాటు మేట్ చార్జీలు సైతం నిలిచిపోయాయి. ప్రత్యేకించి ఉపాధి హామీ పనులను వేసవిలో ఎండ తీవ్రతను తట్టుకొని పని చేయాల్సి ఉంటుంది. ఎండ ప్రభావంతో కూలీలు చేసే పని కూడా తగ్గుతుంది. అయితే ప్రభుత్వం సాధారణ పని దినాల్లో కూలీలకు ఇచ్చే వేతనం ఏ మాత్రం తగ్గకుండా వేతనం లభించేలా ప్రతి ఏటా వేసవి ప్రారంభం నుంచి ముగిసే వరకు అదనపు కూలి చెల్లిస్తుంది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నుంచి జూన్ చివరి వరకు అదనపు కూలి రేట్లు వర్తించే విధంగా ప్రభుత్వం వేసవి ప్రారంభంలోనే ఉత్తర్వులు జారీ చేసేది. వేసవి డ్రై అలవెన్స్‌ల రూపంలో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి 25 శాతం, ఏప్రిల్, మే మాసాల్లో 30 శాతం, జూన్ నెలలో 20 శాతం చొప్పున వేతనం అదనంగా తీసుకునేవారు ఉపాధి కూలీలు. వేసవిలో తక్కువ పని చేసినప్పటికీ పూర్తిస్థాయిలో కూలి పొందేవారు. వేసవిలో వ్యవసాయ పనులు అరకొరగా ఉన్న సమయంలో కూలీలు అలవెన్స్‌లను సద్వినియోగం చేసుకునేవారు. దీంతో వేసవి కాలంలో రోజురోజు కూలీల సంఖ్య పెరుగుతుండేది కూడా.

కేంద్ర సాఫ్ట్‌వేర్‌తో తగ్గిన కూలి ...

గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టీసీఎస్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సాఫ్ట్‌వేర్ ద్వారా ఎన్ఆర్ఈజీఎస్ కార్యకలాపాలు జరిగేవి. ఇందులో గుర్తించిన పనుల వివరాలను అప్‌లోడ్ చేసి ఎస్టిమేషన్ జనరేట్ చేసేవారు. ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా మన రాష్ట్రంలోని పరిస్థితులకు అనుకూలంగా పనులను చేసేవారు. ఈ మేరకు వేసవిలో కూలీలకు ప్రత్యేక అలవెన్స్‌లు వర్తింపు జరిగేది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 2021 నవంబర్ నుంచి ఒకే సాఫ్ట్‌వేర్ అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ నేషనల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెంటర్ (ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చింది. అన్ని రాష్ట్రాలు తప్పనిసరిగా ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా పథకం కార్యకలాపాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో వేసవి అలవెన్స్‌లు ఇవ్వడానికి అవకాశం లేకుండా పోయింది. గతంలో పనిముట్లు వాడకానికి రోజుకు రూ .5 చొప్పున ఇచ్చే తట్ట, బుట్ట చార్జీలు, రోజుకు రూ.15 ఇచ్చే గడ్డపార చార్జీలు సైతం నిలిచి పోయాయి. వేసవిలో దాహార్తి తీర్చుకోడానికి ఒక్కో కూలీకి రోజుకు రూ.5, మిగిలిన కాలంలో రూ.2.50 చొప్పున చెల్లించే అలవెన్స్‌లు కూడా పూర్తిగా నిలిచి పోయాయి. అదే విధంగా గ్రూపు మేట్‌కు ఆ రోజు పని చేసిన కూలీల సంఖ్య మేరకు ఒక్కోక్క కూలీకి రూ.3 చొప్పున చార్జీలు ఇచ్చేవారు. ఇది కూడా నిలిచి పోయిందని మేట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కూలీలు తమ నివాసం నుంచి పని ప్రదేశం వరకు ఇచ్చే రవాణా చార్జీలు మాత్రం కొనసాగుతున్నాయి. వేసవి అలవెన్స్‌లు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

అలవెన్స్‌లు నిలిచిపోయింది వాస్తవమే



ఉపాధి హామీ కూలీలకు వేసవిలో ఇచ్చే ప్రత్యేక అలవెన్స్ నిలిచిపోయింది వాస్తమే. గతంలో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ కార్యకలాపాలు కొనసాగించడం జరిగింది. అయితే 2021 నవంబరు నుంచి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ తీసుకు రావడంతో అలవెన్స్‌లు నిలిచిపోయాయి. వేసవి అలవెన్స్‌లు ఉపాధి కూలీలకు ఊరటగా ఉండేది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

–పి.వెంకటనారాయణ, ఏపీడీ, సత్తెనపల్లి క్లస్టర్

నేడు జగనన్న సురక్ష గ్రామసభ

నకరికల్లు: మండలంలోని చీమలమర్రి గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామంలోని సచివాలయంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు తమకు అర్హత కలిగిన పథకాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ముప్పాళ్లలో జగనన్న సురక్ష క్యాంపులు

ముప్పాళ్ళ: మండలంలోని ఆయా గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారధులు నిర్వహించిన జగనన్న సురక్ష సర్వేకు సంబంధించి క్యాంపులు నిర్వహించటం జరుగుతుందని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ ఆదివారం తెలిపారు. రెండు టీములుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో క్యాంపులు ద్వారా అర్హులకు ధ్రువపత్రాలు అందించటం జరుగుతుందన్నారు. ఒక టీంలో తహసీల్దార్, ఈఓపీఆర్డీ, మరో టీంలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్‌లు ఉంటారన్నారు. 4వ తేదీన నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లోను, 6న గోళ్ళపాడు, లంకెల కూరపాడు, 11న ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, 13న రుద్రవరం, తొండపి, 18న మాదల-1,2 గ్రామాల్లోను, 20న బొల్లవరం గ్రామాల్లోను క్యాంపులు నిర్వహించి ధ్రువపత్రాలు అక్కడికక్కడే అందిస్తామన్నారు.

సెల్‌ఫోన్లు పోతే ఆధారాలతో ఫిర్యాదు చేయాలి

శావల్యాపురం: సెల్‌ఫోన్లు పోయిన వారంతా ఆధారాలతో పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేస్తే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చర్యలు తీసుకుంటామని వినుకొండ రూరల్ సీఐ ఉప్పు టూరి సుధాకర్ తెలిపారు. స్థానిక పోలీ సు స్టేషను సీఐ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్ పరిధిలో అన్నీ మండలాల్లో నేరాల రేటు గణనీయంగా తగ్గిందని తెలిపారు. చట్టాలపై ప్రజల్లో చైతన్యం పెరగడంతో నేరాలు నియంత్రణ అవుతున్నాయని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల్ని సహించమని, గ్రామాల్లో పోలీసు నిఘా పెంచామని తెలిపారు. అనంతరం స్టేషనులో రికార్డు పరిశీలించి, సిబ్బంది పలు సూచనలు చేశారు. ఆయనతో ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గల్లా రవికృష్ణ ఉన్నారు.

నేటి నుంచి మండలంలో 'జగనన్న సురక్ష'

రెంటచింతల: రాష్ట్రంలోని ప్రజలందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించడంలో 100 శాతం సంతృప్తే ధ్యేయంగా, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం మండలంలో ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో వివిధ గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మండల స్థాయిలో ఒక బృందాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై.మహాలక్ష్మి, తహసీల్దార్ కె.పుల్లారావు, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రావు, డిప్యూటీ తహసీల్దార్ జె.రాజారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.నరేంద్రారెడ్డి, ఆర్.డి.కాంతారావులతో ఒక బృందంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 3న గోలి, 5న జెట్టిపాలెం, 7న మల్లవరం, 10న మంచికల్లు, 12న మిట్టగుడిపాడు,14న పాలువాయి, 17న పాలువాయిగేటు, 19న పశర్లపాడు, 21న రెంటచింతల-1, 24న రెంటచింతల-2, 26న రెంటచింతల-3, 28న రెంటాల, 29న తుమ్మకోట గ్రామాలలో నిర్వహించనున్న ఈ జగనన్న సురక్ష సమావేశాలలో సంక్షేమ పథకాలు అందని అర్హులైనవారికి పథకాలను అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

రెంటచింతలలో శాంతియుత ర్యాలీ



క్యాండిల్స్‌తో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రెంటచింతల: ఇటీవల కాలంలో మణిపూర్ రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న హింసాత్మక సంఘటనల నేపథ్యంలో ఆదివారం కానుకమాత చర్చి విచారణ గురువు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కథోలికులు క్యాండిల్స్‌తో శాంతియుత ర్యాలీని చర్చి వద్ద నుంచి గ్రామ పురవీధులలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ వైఎల్ మర్రెడ్డి మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకునేలా చర్యలు చేపట్టాలన్నారు. హింసతో సమస్యలు తీరవన్నారు. మణిపూర్ ప్రజలు హింసాత్మక ఘటనలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి శాంతి కలుగచేయడానికి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. వలస పోయిన ప్రజలకు కనీస వసతులు కల్పించాలని.. హింస వద్దు.. శాంతి ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం కానుకమాత చర్చిలో ప్రత్యేక పూజాబలిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో విఫలమైన కేంద్రం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

దాచేపల్లి: కేంద్రప్రభుత్వ నిర్వాకంతో రూ.వేలకోట్లు బ్యాంక్‌లకు ఎగ్గొట్టి జల్సాలు చేస్తున్నా చోద్యం చూస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో సీపీఐ క్రియాశీల కార్యకర్తలు, నాయకులకు జరిగిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. బ్యాంకులకు రూ.లక్షల కోట్లు ఎగొట్టిన వారంతా ఇతర దేశాల్లో జల్సాలు చేస్తున్నారని, నల్లధనంను తీసుకువస్తానని చెప్పిన మోదీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. దేశంలో బీజేపీ పరిపాలన బరి తెగించిందని, అన్ని వర్గాల ప్రజలకు దేశంలో రక్షణ లేకుండా పోయిందని ఆయన అన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి 9ఏళ్లు గడిచిన జన్‌ధన్ ఖాతాల్లో రూపాయి కూడా జమ చేయలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన మండిపడ్డారు. దేశ సంపదను కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతుందని, అంబానీ, ఆదానీ కంపెనీలకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర చేస్తుందని ఆరోపించారు. అనంతరం నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. ధర్నాలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, నాయకులు మారుతీ వరప్రసాద్, రాంబాబు, షేక్ హుస్సేన్, మందపాటి రమణారెడ్డి, గని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు



వ్యాస భగవానుని విగ్రహానికి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

అమరావతి: మానవాళిని సన్మార్గంలో నడిపించి ఉజ్వల భవితను ప్రసాదించి అందరికీ మార్గదర్శకంగా నిలిచేది గురువేనని భవఘ్నిగురూజీ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం భవఘ్ని ఆరామంలో ఆదివారం గురుపూర్ణిమ ఉత్సవాలలో రెండోరోజు కార్యక్రమాలలో భాగంగా వ్యాసభగవానుని ఊరేగింపు వ్యాసపూజ, వ్యాసగాయత్రి పఠనం నిర్వహించారు. ఈసందర్భంగా భవఘ్ని గురూజీ మాట్లాడుతూ మహోన్నతమైన ఆధ్యాత్మిక జ్ఞాన సంపదను మనకు అర్థమయ్యేరీతిలో బోధించే గురువులను పూజించేందుకే గురుపూర్ణిమ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు, సోదరులు, స్నేహితులు, సర్వజనులు సుఖసంతోషాలతో జీవించటానికి ఉపయోగపడే భగవద్గీత సారాంశాన్ని ప్రచారం చేయాలన్నారు. ఈసందర్భంగా ఆదిగురువు వ్యాస భగవానునికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం వ్యాసభగవానుని విగ్రహానికి ఊరేగింపుగా ధర్మక్షేత్రప్రాంగణానికి తీసుకువచ్చారు. భవఘ్ని గురూజీ శిష్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు అవసరం



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏఓ వేణుగోపాల్

క్రోసూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులు విత్తనాల కొనుగోలులో మెలకువలు పాటించాలని మండల ఏఓ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన సందర్భంగా ఏఓ మాట్లాడుతూ విత్తనాలు లైసెన్సు కలిగిన డీలర్ల వద్ద నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. కొన్న విత్తనాల బిల్లులను తప్పక తీసుకోవాలని, అందులోని వివరాలు కొనుగోలు చేసిన విత్తనాల వివరాలతో సరిచూసుకోవాలన్నారు. బిల్లులను పంట కాలం పూర్తయ్యేవరకు రైతులు తమ వద్ద భద్రపరుచుకోవాలన్నారు. విత్తన వ్యాపారులు ఏదైనా అవకతవకలకు పాల్పడితే తక్షణమే 8331056937 నెంబరుకు తెలియచేయాలని కోరారు.

6న మార్కెట్ యార్డు సర్వసభ్య సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీన నిర్వహించటం జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో మార్కెట్ యార్డు డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

అమ్మవారికి ఆషాఢ సారె

నరసరావుపేట రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారికి ఆదివారం విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. పట్టణానికి చెందిన హరే శ్రీనివాస భక్త బృందం సారెను సమర్పించింది. మహిళలు పొంగళ్లు పొంగించి సమర్పించారు.